మహిషాసురమర్దినిగా అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం భక్తులు అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు.అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు నిర్వహించారు. ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు చేశారు. ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారు శ్రీకాళికాదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ కార్యదర్శి మందపాటి యుగంధర్‌వర్మ పర్యవేక్షించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. లోక కళ్యాణార్థం వేదపండితుల మంత్రోచ్చారణలతో హోమం చేశారు. బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మ ప్రచార పరిషత్ బచ్చుమాధవీమురళీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు నిర్వహించారు. దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత దంపతులు పాల్గొని పూజలు చేశారు.


రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు


మధురానగర్ మెయిన్‌రోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు


శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారు

మధురానగర్ మెయిన్‌రోడ్డులో..

మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు. మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి కుంకుమార్చనలు చేయగా, పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు. జీవీఆర్‌నగర్‌లో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు చేశారు.

సాయంత్రం పారాయణం జరిగింది. కార్యక్రమాలను జీవీఆర్‌నగర్ భక్తబృందం సభ్యులు గద్దే శ్రీను, నూతక్కి శ్రీను పర్యవేక్షించారు. శ్రీప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.

చల్లపల్లి బంగ్లా సమీపంలో..

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసియున్న శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో దేవీశరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారిని బుధవారం మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఈవో వై.సీతారామయ్య, వంశపారంపర్య ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


శ్రీ గంగానమ్మ దేవాలయంలో...


గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారు


శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు


శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ..

శ్రీగాయత్రీ సొసైటీలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీగాయత్రి సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సొసైటీ ప్రాంగణంలో రాఘంపూడి అమూల్య శిష్యబృందం గాత్ర కచేరీని ఆయన తిలకించి చిన్నారులను ప్రశంసించారు. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ గాయత్రి సొసైటీ వారు పేదలకు ఎన్నో సేవలు చేయడంతోపాటు దసరా మహోత్సవాలను అత్యంత శాస్త్రోక్తంగా నిర్వంహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు, గాయత్రి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


సంగీత విద్యాంసురాలిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

64వ డివిజన్‌లో...

పాయకాపురం(విజయవాడరూరల్): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులు బుధవారం అమ్మవారిని శ్రీమహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు చేశారు. 64వ డివిజన్ బర్మాకాలనీలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిగా అలంకరణలో భక్తులకు దర్శనిమచ్చారు. కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ దంపతులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నాలుగుస్తంబాల సెంటర్‌లో నూకాలమ్మ గుడి లో అమ్మవారికి పూజలు చేశారు. ప్రజాశక్తి నగర్లోని శ్రీకనక దుర్గమ్మ దేవస్థానం, రాజీవ్‌నగర్లోని నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, సంతోషిమాత దేవస్థానం, రాజీవ్‌నగర్‌లో శ్రీవాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయం, సుందరయ్యనగర్లోని శ్రీవాసవీమాత దేవస్థానంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిగా భక్తులను దర్శనమిచ్చారు. అమ్మవార్లను భారీసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


బర్మా కాలనీలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ దంపతులు, భక్తులు

క్లుప్తంగా

ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండగ సందర్భంగా ప్రతీ ఇంటా సంతోషం వెల్లి విరియాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. నగర ప్రజలకు మల్లాది విష్ణు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని పేర్కొన్నారు. జగన్మాత ఆశీస్సులతో నగర ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తులతూగాలన్నారు. ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలని విష్ణు ఆకాంక్షించారు.

హృద్యంగా సాగిన కచేరి



విజయవాడ కల్చరల్: శృంగేరీపీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణసదనంలో బుధవారం వీణా విద్వాంసురాలు ఎస్. సుజాత సరస్వతి సమార్చనలో భాగంగా సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి, స్వాతి తిరునాళ్, అన్నమయ్య కీర్తనలను వీణపై పలికించారు. కుందుర్తి అరవింద్ వాద్య సహకారం అందించారు. శరన్నవరాత్రులలో భాగంగా శారదాంబ సింహవాన చాముండి, బాలా త్రిపురసుందరి మహిశాసురమర్ధని ,శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచారు. వీరుభొట్ల లక్ష్మీఫణికుమారశర్మ ఆధ్వర్యంలో చండీహోమం, దుర్గాసప్తశతి పారాయణం నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పర్యవేక్షించారు.

కొనసాగుతున్న పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో షిర్డీ సాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాలు బుధవారం పదోరోజుకు చేరుకున్నాయి. పుణ్యతిథి మహోత్సవాలలో భాగంగా బాబా వారికి క్షీరము, పన్నీరుతో అభిషేకం చేశారు. లోక కళ్యాణార్థం మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సాయినాథ, అష్టాక్షరీ హోమం నిర్వహించారు. కార్యక్రమాలను మందిర అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, లఖంరాజు సునీత, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

జిల్లా సరోగసి బోర్డు సమావేశం

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఎన్టీఆర్ జిల్లా సరోగసి బోర్డు సమావేశం బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఐదుగురు దంపతులు అద్దెగర్భం కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని బోర్డు సభ్యులు పరిశీలించారు. వారికి ఉన్న అర్హతలు తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అనిల్ కుమార్, గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


నృత్యాలు ప్రదర్శిస్తున్న హవీషా చౌదరి బృందం


హిమజ బృందం నృత్యాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

యువ నృత్య కళాకారిణి హవీషాచౌదరి గణేశ కౌతం, జయదేవుని అష్టపది, జతి స్వరం అంశాలను ప్రదర్శించారు. జీ ప్రియ కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య కీర్తనలకు నృత్యాలను ప్రదర్శించారు. హిమజ బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విజయకుమార్ బృందం డాల్ నృత్యాలను, అమలాపురానికి చెందిన వి.సత్యనారాయణ తొలుబొమ్మలాటను చివరిగా కలహాల కాపురం నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. సాంస్కృతిక శాఖకు చెందిన మంజూష, సుమన్, శ్రీనివాస్ పర్యవేక్షించారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

హైదరాబాద్‌కు చెందిన మయూరి డాన్స్ అకాడమీ బృందం కూచిపూడి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. పెరవలి నందకుమార్ బృందం వయోలిన్‌పై సంప్రదాయ కీర్తనలను పలికించారు. ప్రేమానందం బృందం భక్త ధ్రువ బుర్రకథను వినిపించారు. పీవీ రమణ జానపదగేయాలను ఆలపించారు. అనపర్తి ఏడుకొండలు తోలుబొమ్మలాటను ప్రదర్శించారు.

వైభవంగా శ్రీవారి బ్రహోత్సవాలు


చండీహోమం నిర్వహిస్తున్న రుత్వికులు


గరుడవాహన సేవలో స్వామివారు

విజయవాడ కల్చరల్: శ్రీశారదా చంద్రమౌళీశ్వర, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైవున్న పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ వాహన సేవ, లోత్సవం, శాంతి హోమం, జలకుంకుమోత్సవ లోకశాంతి కోసం చండీ హోమం నిర్వహించారు. శారదాదేవి దుర్గాదేవిగా పూజలందుకుంది.

సంగీత విద్వాంసురాలు మల్లాది కార్తీక త్రివేణి, ప్రవాసాంధ్ర సంగీత విద్వాంసురాలు రేకపల్లి శ్రీదేవి వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. కార్యక్రమాలను దేవాలయ నిర్వాహకులు డాక్టర్ రామ్మోహనరావు, మేనేజర్ శర్మ నిర్వహించారు.

అమ్మ ఆశీస్సులు అందరికీ లభించాలి

దేవినేని అవినాష్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ లభించాలని.. ప్రజలందరూ సుఖసంతోషాలు..ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆకాంక్షించారు. స్థానిక బావాజీపేట 4వ లైనులో బుధవారం శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ బచ్చు మాధవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న బచ్చు మాధవీమురళీకృష్ణను అభినందించారు. భక్తితో సేవిస్తే అమ్మవారు సకల కష్టాలు తీరుస్తారని పేర్కొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న దేవినేని అవినాష్

వృద్ధులను అందరూ ఆదరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధాప్యమనేది అందరి జీవితాల్లో ఓ భాగమని, ప్రతిఒక్కరూ వృద్ధులను ఆదరించాలని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో మాచవరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు వృద్ధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ నాయకులు సుబ్బారావు, నాగరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాపురంలో...

ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 27వ డివిజన్ దుర్గాపురంలో బుధవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులకు సత్కరించారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బి.వసంతకుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యం శాపం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రిటైర్డ్ ఎస్ఐ ఎం.చెన్నారెడ్డి, రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ కె.గణేష్ బాబు, లక్ష్మీపురం బాబూరావు, రిటైర్డ్ వీఎంసీ ఉద్యోగి గుర్రం ఏడుకొండలు తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్కే షఫీవుల్లా, హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్ఆర్ కళాశాలలో వృద్ధులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా పండుగను పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలకు ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల తన నివాసం (బొండా ఆర్ట్ గ్యాలరీ)లో బుధవారం చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాదికూడా వంద మంది మహిళలకు అందించినట్లు తెలిపారు.

బాధిత బాలికకు ఐద్వా పరామర్శ

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసుస్టేషన్ పరిధి ఏపీఎస్‌రెడ్డి రోడ్డు లో నివాసం ఉంటున్న అత్యాచార బాధిత బాలికను ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.సరోజ, సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీ బుధవారం పరామర్శించారు. చిన్న వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయి పిన్ని, బాబాయి వద్ద ఉంటూ 7వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను సొంత బాబాయే అత్యాచారం చేసి గర్భవతిని చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికకు ప్రభుత్వంగా నిలిచి ఆర్థికసాయం అందించాలని కోరారు. బాలికను పరామర్శించిన వారిలో 64వ డివిజన్ అధ్యక్షురాలు లత కూడా ఉన్నారు.

కీర్తి పురస్కార గ్రహీత శోభనాద్రికి సత్కారం




భవానీపురం(విజయవాడపశ్చిమ): వ్యక్తిత్వ వికాస రంగంలో విశేష కృషి కృషి చేసిన విజయవాడకు చెందిన తిరుక్కోళ్లూరి శోభనాద్రికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు-బీవీ దాశరథి కీర్తి పురస్కారాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల హైదరాబాద్‌లో ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, చిన్నయ సూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి ఎస్పీ శేషగిరిరావు బుధవారం రామవరప్పాడులోని ఆయన నివాసంలో అభినందించి సత్కరించారు. శేషగిరిరావు మాట్లాడుతూ శోభనాద్రి 92 ఏళ్ల వయసులో కీర్తి పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికీ సామాజిక, సాంఘిక, సాంస్కృతిక, సాహితీ రంగాలలో సేవలు అందించడం ఆయనలోని తపనకు నిదర్శనమని కొనియాడారు. సాహితీ పీఠం సభ్యులు పి. వెంకటేశ్వరరావు, పావని విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొండపై పండుగ సందడి


అంతరాలయం సమీపంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమివచ్చిన అమ్మవారిని బుధవారం వేలాది మంది భక్తులు సందర్శించుకున్నారు. కొండపై పండుగ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భవానీలు అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


హారతి తీసుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో భక్తుల రద్దీ


మహిషాసురమర్దిని అలంకారంలో కళాకారిణి


వైభవంగా కొనసాగుతున్న అమ్మవారి నగరోత్సవం


కుంకుమ పూజ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు




కృష్ణానది వరద ప్రవాహంలో హంస వాహనం